ప్రజాశక్తి
సోమవారం 11 సెప్టెంబర్ 2023
5
విజయనగరం



18న అప్రెంటీస్ మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ నెల 18న స్థానిక ప్రభుత్వ ఐటిఐలో అప్రెంటిస్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టివి గిరి ఒక ప్రకటనలో తెలిపారు. పిఎంఎన్ఎంలో భాగంగా అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐటిఐ పాసై, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను www.apprenticesshipindia.gov.in లేదా dgt.gov.in/appలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా కోరారు. అప్రెంటీస్ మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని సూచించారు. ఇతర వివరాలకు 9849118075, 9849947654 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రెండో రోజూ నిరసనలు



విజయనగరంలో సామూహిక నిరాహార దీక్ష చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

- గృహనిర్బంధంలో ముఖ్యనాయకులు
- సామూహిక దీక్షలు చేపట్టిన టిడిపి శ్రేణులు
- అడ్డుకున్న పోలీసులు
- మూర్ఖత్వానికి తలా తోకా ఉండవు : అశోక్ గజపతిరాజు ఆగ్రహం

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా జిల్లాలో రెండో రోజు ఆదివారమూ నిరసనలు కొనసాగాయి. టిడిపి నాయకులు సామూహిక దీక్షలు చేపట్టారు. ఎక్కడికక్కడ టిడిపి ముఖ్య నాయకులు బయటకు రాకుండా ఉదయం నుంచే పోలీసులు గృహ నిర్బంధాలు విధించారు. సామూహిక దీక్షలను భగ్నం చేశారు. పోలీసులు, ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ పలు చోట్ల నల్లకండువాలతో నిరసనలు చేపట్టారు.

ప్రజాశక్తి-విజయనగరంకోట

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు మండిపడ్డారు. విజయనగరంలోని అశోక్ బంగ్లాలో నల్ల కండువాలు వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన నడవడం లేదన్నారు. మూర్ఖత్వానికి తలా, తోకా ఉండవన్నారు. శాంతియుతంగా నిరసనలు తెలియజేయకూడదని ఏ నిబంధనలూ చెప్పలేదన్నారు. భయపడితే లాభం లేదని, ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోమని స్పష్టంచేశారు. చంద్రబాబుకు అండగా ఉంటామని తేల్చిచెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విజయనగరంలోని దర్గాలో, ఆర్‌సిఎం చర్చిలో, గురునానక్ బాబా మందిరంలో టిడిపి నాయకులు ప్రార్థనలు చేశారు. నగరంలో టిడిపి నగర మాజీ అధ్యక్షులు కర్రోతు వెంకట నర్సింగరావును హౌస్ అరెస్టు చేశారు. కార్యక్రమాల్లో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కోండ్రు మురళి, రొంగల రామారావు, విజ్జపు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. **నెల్లిమర్ల** మండల కేంద్రంలో టిడిపి ఆధ్వర్యాన సామూహిక నిరాహార దీక్ష చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్‌రావు, సువ్వాడ రవి శేఖర్.. ఎన్‌టిఆర్, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి శాంతి యుతంగా నిరసన చేశారు. వీరిని వెంటనే నెల్లిమర్ల పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, నాయకులు లెంక అప్పలనాయుడు, పోతల రాజప్పన్న, నల్లం శ్రీనివాసరావు, రెడ్డి వేణు, చిల్ల పద్మ, కోట్ల సునీత, గురాన చక్రధర్, అట్టాడ శ్రీధర్ పాల్గొన్నారు. **బొబ్బిలి** పట్టణంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సామూహిక దీక్ష చేపట్టేందుకు టిడిపి నేతలు టెంటు వేయగా పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు, పోలీసులు అడ్డుకున్నారు. కోటలో దీక్ష చేయాలని పోలీసులు సూచించడంతో ప్రభుత్వం తీరుపై బేబినాయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కోటలో దీక్షలు నిర్వహించారు. **వేపాడ** మండలంలోని డిఆర్‌పేటలో టిడిపి మహిళలు నిరసన తెలిపారు. **చీపురుపల్లి** పట్టణంలో టిడిపి నాయకులు చేపట్టిన సామూహిక నిరాహార దీక్షలను పోలీసులు భగ్నం చేశారు. ఆదివారం ఉదయం నుంచి పోలీసులు ఎన్ని నిర్బంధాలు విధించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జునను స్వగృహంలో హౌస్ అరెస్టు చేశారు. ఆయన సూచనలతో స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో టిడిపి నాయకులు నిరాహార దీక్షకు దిగారు. కొద్దిసేపటికే పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని దీక్షను భగ్నం చేశారు. నాయకులను అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీక్షలో కూర్చున్న టిడిపి నాయకులపై బైండవర్ కేసులు పెట్టారు. **శృంగవరపుకోట** పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలకు కూర్చున్న లలితకుమారి గ్రూపును, పట్టణంలోని దేవి కూడలిలో అంబేద్కర్ విగ్రహం పక్కన నిరాహార దీక్షలకు కూర్చున్న గొంప కృష్ణ గ్రూపును దీక్షలను పోలీసులు భగ్నం చేశారు. ఈ సందర్భంగా టిడిపి వేపాడ మండల అధ్యక్షులు గొంప వెంకటరావును అరెస్టు చేశారు. ఆదివారం తెల్లవారుజామునే పట్టణంలోని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణను తన నివాసంలోనూ, ఎల్‌కోటలోని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని తన నివాసంలోనూ హౌస్ అరెస్ట్ చేశారు. **పూసపాటిరేగ** మండలంలో టిడిపి సామూహిక నిరాహార దీక్షలకు పిలుపునివ్వడంతో పూసపాటిరేగ పోలీసులు ఆదివారం ఉదయం నుంచి అప్రమత్తమయ్యారు. టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరరావుతో పాటు నాయకులు పసుపులేటి గోపి, పిన్నింటి శ్రీనువాసరావు, ఇజ్జురోతు ఈశ్వరరావు, పిళ్లా లక్ష్మినారాయణ, బొంతు రవి, పులపా వెంకటప్పారావు, పిళ్లా శ్రీరాములు, కొరటాన ప్రసాద్‌రావు, పిన్నింటి సీతం నాయుడు, చందక ఆనందరావు, రాకేష్ శర్మను అదుపులోకి తీసుకున్నారు.

నేడు జిల్లా బంద్

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును వ్యతిరేకిస్తూ సోమవారం జిల్లా బంద్‌కు ఆ పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున పిలుపునిచ్చారు. బంద్‌లో పార్టీ శ్రేణులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.


శృంగవరపుకోట.. టిడిపి వేపాడ మండల అధ్యక్షులు గొంప వెంకటరావును అరెస్టు చేస్తున్న పోలీసులు


చీపురుపల్లిలో సామూహిక దీక్ష టెంటు కూల్చేసిన పోలీసులు


బొబ్బిలిలో సామూహిక నిరాహార దీక్షలు చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు


నెల్లిమర్లలో నిరసన చేపడుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు


దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతారావు

కాంట్రాక్టు ఉద్యోగుల వేడుకోలు దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష, కెజిబివిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం కలెక్టరేట్ వద్ద వేడుకోలు దీక్ష చేపట్టారు. ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు, సిఆర్‌ఎంటి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గురువులు మాట్లాడుతూ పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు అన్ని విభాగాల కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినిమం టైం స్కేల్ అమలు చేసి, వేతనాలు పెంచాలని కోరారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలని డిమాండ్‌చేశారు. పార్ట్ టైం విధానాన్ని రద్దు చేయాలన్నారు. పనిభారం తగ్గించి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అన్ని పోస్టులకు కచ్చితమైన జాబ్‌చార్ట్ ఇవ్వాలని, ప్రతి నెల ఒకటో తేదికి వేతనాలు చెల్లించాలని కోరారు. దీక్షకు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు జి.అప్పలసూరి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌ఎంటి ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.లక్ష్మునాయుడు, కంప్యూటర్ ఆపరేటర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు, పలు యూనియన్ల నాయకులు బి.రవీంద్ర, ప్రమీల, పోలినాయుడు, గణేష్, ఎస్.రమాదేవి, శ్రీనివాసరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

21 నుంచి స్వర్ణోత్సవ ప్రచారయాత్ర

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈ నెల 21 నుంచి చేపట్టే స్వర్ణోత్సవ ప్రచార యాత్రను విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వర్ణోత్సవ ప్రచారయాత్రను ఈ నెల 21 నుంచి 29 వరకు ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా 22న బొబ్బిలి, గజపతినగరం, విజయనగరంలో, 23న కొత్తవలసలో పతాక ఆవిష్కరణ, సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చెయ్యాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ సంఘం కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టి, భవిష్యత్తు కార్యక్రమాలను వెల్లడించారు. సమావేశంలో సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, జిఒ 117 రద్దు చెయ్యాలని, బోధనేతర పనులు రద్దు చేయాలని, పాఠశాలల నిర్వహణకు నిధులు కేటాయించాలని తీర్మానించారు.

అనంతరం నాయకులు భాస్కర్ ఆడిట్ రిపోర్టు ప్రవేశపెట్టారు. తొలుత ఇటీవల కాలంలో మరణించిన ఉపాధ్యాయులకు సంతాప తీర్మానాన్ని ఎ.సత్యశ్రీనివాస్ ప్రవేశపెట్టగా, సభ్యులంతా మౌనం పాటించారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము, కె.శ్రీనివాసరావు, జి.పద్మావతి, జి.పార్వతి, కె.ప్రసాదరావు, ఎ.శంకరరావు, ఆర్ఎవి సూర్యారావు, కె.శ్రీదేవి, భవాని, పి.రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లు రద్దుచేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

ప్రజాశక్తి-రామభద్రపురం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక శ్రీవెంకటేశ్వర కళాశాల ప్రాంగణంలో సిఐటియు విస్తృత స్థాయి సమావేశాన్ని మండల కార్యదర్శి బలసా శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులపై తీవ్రమైన భారాలను మోపుతుం దన్నారు. కంపెనీలో సంఘం పెట్టుకొనే అవకాశం లేకుండా, కార్మిక సమస్యలపై పోరాటాలు చేయకుండా కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకులు కార్మికులకు ఇచ్చిన హామీలను మర్చిపోయారని ఎద్దేవా చేశారు. కార్మికులకు నష్టం చేకూర్చే విధానా లను తీసుకొస్తే భవిష్యత్తులో అదే కార్మికులు ఓటు అనే ఆయుధంతో ఇంటికి పంపించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కార్మికులకు అండగా సిఐటియు పోరాటం సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గోపాలం, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

ఎన్‌సిబిసి సమావేశాలకు ఎమ్‌పి బెల్లాన

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 13న ఢిల్లీలో జరిగే జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (ఎన్‌సిబిసి) సమావేశానికి ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ హాజరు కానున్నారు. దేశవ్యాప్తంగా వివిధ కులాలు తమను ఒబిసి జాబితాలో చేర్చాలని చేసిన విజ్ఞప్తులను ఈ కమిషన్ పరిశీలించనుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తూర్పుకాపు, శిష్ట కరణం, కళింగ కోమటి, కళింగ వైశ్య, సొండి, అరవ తదితర కులాలు నుంచి, తమను ఒబిసి జాబితాలో చేర్చాలని విజ్ఞప్తులు అందించాయి. ఈ నేపథ్యంలో జరిగే కమిషన్ కీలక సమావేశానికి హాజరుకావాలని ఒబిసి కమిటీ సభ్యులుగా ఉన్న ఎమ్‌పి బెల్లానకు ఆహ్వానం అందింది.



ప్రత్యామ్నాయ పంటలు అవసరం లేదు

- సంవృద్ధిగానే వర్షాలు
- వారంలో వంద శాతం వరినాట్లు
- అందుబాటులో ఎరువులు
- 75 శాతం ఇ- క్రాప్ నమోదు
- ప్రజాశక్తితో జిల్లా వ్యవసాయ శాఖాధికారి రామారావు ముఖాముఖి



జిల్లాలో ప్రత్యామ్నాయ పంటలు అవసరం లేదని, ఖరీఫ్‌లో సాధారణ పంటల సాగుకు అనుకూలంగానే వర్షాలు కురిశాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.టి.రామారావు తెలిపారు. మరో వారం నుంచి పది రోజుల్లో వంద శాతం వరినాట్లు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎరువులు కూడా ఆర్‌బికెల్లో అందుబాటులో సిద్ధంగా ఉన్నాయన్నారు. ఖరీఫ్ పంటలన్నీ కలుపుకుని 75 శాతం ఇ-క్రాప్ నమోదు చేశామని వివరించారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

? ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగు ఏమేరకు సాగింది.?

గత ఖరీఫ్ సీజన్‌లో 3,02,602 ఎకరాల్లో అన్ని పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది సుమారు 3,13,465 ఎకరాల్లో సాగవుతాయని అంచనా. ఇప్పటి వరకు 2.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ, గడిచిన పది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాధారణ విస్తీర్ణంలో సాగయ్యే అవకాశాలు ఉన్నాయి.

? ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక ఎంత వరకు వచ్చింది.?

జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగు అవసరం లేదు. ఆగస్టు నెలాఖరు వరకు వర్షపులోటు ఉండడం వల్ల ప్రత్యామ్నాయ పంటల కోసం ప్రణాళిక రూపొందించిన మాట వాస్తవమే. 1001, 1010 రకం వరికి బదులు ఎన్ఎల్ఆర్ 24449 రకం ప్రోత్సహించాలని ప్రభుత్వం భావించింది. సెప్టెంబర్ 15వ తేదీ దాటితే ఈ ప్రణాళిక అమలు చేయాలని భావించాం. కానీ, అనంతరం కురిసిన వర్షాల వల్ల వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ప్రత్యామ్నాయం వైపు చూడాల్సిన అవసరం లేదు.

? ప్రధానమైన వరి పంట పరిస్థితి ఏమిటి.?

జిల్లాలో వరి ప్రధానమైన పంట. సాధారణ విస్తీర్ణం 2,25,637 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు సుమారు 1,90,500 ఎకరాల్లో సాగైంది. సాగునీటి వసతి ఉన్న ప్రతి చోటా ఉబాలు పూర్తయ్యాయి. ఇటీవల వర్షాలు కురిసిన నేపథ్యంలో చెరువులు, జలాశయాలు నిండాయి. ఉబాలు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. మరో వారం, పది రోజుల్లో పూర్తిస్థాయిలో నాట్లుపడే అవకాశం ఉంది. పత్తి, మొక్కజొన్న, చెరకు, అపరాలు, మిల్లెట్స్ విస్తీర్ణం కూడా ఈ మేరకు పెరిగే అవకాశం ఉంది.

? వర్షపాతం పరిస్థితి ఏమిటి.?

జూన్, ఆగస్టు నెలల్లో కొంతమేర వర్షపాతం తగ్గినప్పటికీ జులై 82.4 మిల్లీమీటర్ల వర్షం అధికంగానే కురిసింది. హెచ్చుతగ్గుల వల్ల వరినాట్లకు కొంత అంతరాయం, ఇబ్బంది కలిగినమాట వాస్తవమే. కానీ, సెప్టెంబర్ ప్రారంభం నుంచీ రోజూ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెలలో ఇప్పటి వరకు 46.4 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 110.4 మి.మీ మేర కురిసింది. సీజన్ మొత్తంగా పరిశీలిస్తే 18.2 మి.మీ అధికంగానే ఉంది. మండలాల వారిగా పరిశీలిస్తే 12 మండలాల్లో అధిక, మిగిలిన 15 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఈనేపథ్యంలో ఉబాలు ఇటీవల మరోసారి ఊపందుకున్నాయి.

? ఎరువుల అందుబాటులో ఉన్నాయా.?

ఖరీఫ్, రబీ సీజన్లు కలుపుకుని ఏడాదికి 82,641 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. జూన్ నాటికే 19 వేల మెట్రిక్ టన్నులు జిల్లాలో సిద్ధంగా ఉన్నాయి. ఇందులో ఆర్‌బికెల్లో 5 వేల మెట్రిక్ టన్నులు, మార్కెట్‌లో 14 వేల మెట్రిక్ టన్నులు ఉంచాం. యూరియా 47,401 మెట్రిక్ టన్నులు, డిఎపి 13,422 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 13,467 మెట్రిక్ టన్నులు, ఎంఒపి 6,092 మెట్రిక్ టన్నులు, సూపర్ పాస్పేట్ 2,257 మెట్రిక్ టన్నుల చొప్పున జిల్లాకు రావాలి. అవసరానికి సరిపడినంత ఎరువులు వచ్చాయి. ఆర్‌బికెలు, ప్రయివేటు దుకాణాల్లో విరివిరిగా అందుబాటులో ఉన్నాయి.

ముఖాముఖి

? ఇ-క్రాప్ నమోదు ఎంత వరకు వచ్చింది.?

జిల్లా వ్యాప్తంగా పంటలన్నీ కలిపి 2.25 లక్షల ఎకరాల్లో సాగవగా, 1.60 లక్షల ఎకరాలకు పైగా ఇ-క్రాప్‌లో నమోదు చేశాం. ప్రధానమైన వరిపంట 85,559 మంది రైతులకు చెందిన 97 వేల ఎకరాల్లో (61శాతం) నమోదు చేశాం. ఈ నెల 30వ తేదీలోపు మొత్తం పూర్తిచేయాల్సి ఉంది. ఇందుకనుగుణంగా ప్రణాళిక వేసి, ఇ-క్రాప్ నమోదు ముమ్మరం చేశాం.

? కౌలురైతులకు ప్రభుత్వం తరపున సాయం అందుతుందా.?

ఔను! జిల్లా వ్యాప్తంగా 2,603 మంది కౌలు రైతులకు ఇటీవలే ఐదో విడత రైతు భరోసా కింద రూ.1.95కోట్ల మేర అందజేశాం. 182 మంది రైతులకు 9.88 లక్షల మేర నష్టపరిహారం కూడా అందింది. నష్టపరిహారం అందుకున్న వారిలో దేవాదాయ భూములు సాగుచేస్తున్నవారు కూడా ఉన్నారు.

వరదనీటితో రాకపోకలకు అవస్థలు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి-పాతబొబ్బిలి టిబిఆర్ రహదారిపైకి వరదనీరు రావడంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బొబ్బిలి, పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పంట పొలాల్లో చేరుతున్న వరదనీరు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఏటా వరదనీరు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కాలువలు ఆక్రమణకు గురికావడం వల్లనే రోడ్డుపైకి వరదనీరు వస్తుందని ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరదనీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు



మాట్లాడుతున్న ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగారావు

పెండింగ్ జీతాలివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జోగారావు డిమాండ్ చేశారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.శ్యామ్ మాట్లాడుతూ బోధనేతర పనులతో ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయొద్దన్నారు. జిఒ 117ను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ వి.గోవిందరావు, జిల్లా నాయకులు సిహెచ్.సూరిబాబు, స్వామి, మురళి, రవి, రాంబాబు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో ఆడుతూ చదువుతున్న చిన్నారులు

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఆవరణంలో వచ్చిన పిల్లలతో నీతి కథలు, మానసిక ఉల్లాసాన్ని పెంపొందేందుకు పిల్లలతో ఆటలు, పాటలు నిర్వహించారు. కార్యక్రమంలో 18 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు శాఖ గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదన్‌రావు తెలిపారు. ఈయన పిల్లలతో మాట్లాడుతూ సంపదలు అన్నిటికంటే చదువు ఉన్నతమైనదని తెలిపారు. అందుకు విద్యార్థులు తప్పక చదువుపై శ్రద్ధ చూపాలని కోరారు. ఇంటిలో ఖాళీ సమయాలలో సెల్ ఫోన్ కు సమయము ఇవ్వకుండా పుస్తకాలు పట్టుకోవాలని స్కూల్లో ఇచ్చినటువంటి హోం వర్క్ ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని తెలిపారు.

ప్రజలకు సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి - కురుపాం

ఏనుగుల కదలికపై ప్రజలకు అటవీశాఖ అధికారులు సమాచారం ఇవ్వాలని అవి సంచరిస్తున్న పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కురుపాం సమీపంలో ఉన్న హరి అనే ఏనుగు కదలిక, గిరి శిఖర గ్రామమైన జరడలో సంచరిస్తున్న నాలుగు ఏనుగుల గుంపు కదలికలపై గిరిజన గ్రామాల ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. ఎందుకంటే తాము కొండల్లో పోడు వ్యవసాయం చేస్తూ అడవుల్లో పండేటువంటి పంటలను నమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటామని, కావున మేము ఎక్కువగా అడవులకు వెళ్తుంటామని ఏ క్షణాన ఏమి జరుగుతుందో ఏనుగులు ఎక్కడుంటాయో తెలియదని తెలిపారు. దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కు బిక్కు మంటూ అడవులకు వెళ్తున్నామన్నారు. కావున అటవీశాఖ అధికారులు ఏనుగుల కదలికలపై ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించి మా ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు జిల్లా నలుమూలల నిండే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా తరలివచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు సరదాగా నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. జెయింట్ వీల్ ఎక్కి ఆకాశంలో ఉయ్యాల ఊగారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆడుకున్నారు. మరికొంతమంది గైరో ఎక్కి గుండ్రంగా తిరిగారు. ఆనంద విహార్ వద్ద డాన్సులు చేసి కేరింతలు కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

ఉపాధ్యాయునికి ఆత్మీయ వీడ్కోలు

భామిని: మండలంలోని పాత ఘనసరలో స్థానిక ఎంపిపి స్కూల్‌లో పదేళ్లుగా విధులు నిర్వహించి, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు వెంగళి వాసుదేవరావుకు ఆదివారం ఘనసర పాఠశాలలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ కిల్లారి పాల్గుణరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, ఉపాధ్యాయులు వాసు దేవరావుకు శాలువతో సత్కరించి, సన్మానించారు. సర్పంచ్ ఆనందరావు మాట్లాడుతూ స్థానిక గ్రామస్తులతో మమేకమై, తమ గ్రామ పిల్లలకు క్రమశిక్షణ కూడిన విద్యను అందించారని, మీరు పిల్లలకు నేర్పిన ప్రాథమిక విద్య మిమ్మల్ని జీవితాంతం గుర్తించేలా చేస్తుందని, మీ సేవలు మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు అప్పారావు, గ్రామస్తులు, పిల్లలు ఉన్నారు.


మురుగును తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు

మురుగు సమస్య పరిష్కారం

కురుపాం: తోటపల్లి నుండి కురుపాం వరకు రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో కాలువల్లో చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు చేరి ప్రధాన రహదారి వద్ద ప్రవహిస్తుంది. దీంతో మెయిన్ రోడ్డు, జిసిసి కాలనీవాసులు దుర్వాసనను భరించలేక కొద్ది రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంలో ఆదివారం స్థానిక ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ కాలువలో చెత్తాచెదారంతో అడ్డంగా నిలిచిపోయిన చెత్తను తీయించి కాలువ ద్వారా మురుగునీరు పంపించడం ద్వారా దుర్వాసన నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంత ప్రజలు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చెరువు గర్భం ఆక్రమణ

- చెరువుగట్టు మట్టి అక్రమంగా తరలింపు
- పట్టించుకోని మైన్స్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు
- ఉన్నతాధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు

రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు చెరువులు, కాలువలు, గెడ్డ వద్ద భూములు తక్కువ రేటుకు కొని ఆ పక్కనే ఉన్న ప్రభుత్వ భూములన్నింటినీ కబ్జా చేసి తమ స్వాధీనంలోకి తెచ్చుకుంటున్నారు. ఎక్కడెక్కడ నుంచో వచ్చి ఇక్కడ భూములను కొని రియల్ ఎస్టేట్‌లో భాగంగా లేఅవుట్‌లు వేసి వ్యాపారం చేసుకుంటున్నారు.. అయితే ఎకరం భూమి కొని దాని పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కబ్జా చేసి దాన్ని రెండు ఎకరాలు భూమిగా తయారు చేసుకుని విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ప్రభుత్వ భూములను కలుపుకోవడానికి ప్రభుత్వంలో ఉన్న పెద్దల పేర్లు చెప్పి అధికారులపై ఒత్తిడి తెచ్చి భయపెట్టి పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఇందులో భాగంగానే గుండాలపేటలో నారాయణరాజు చెరువు ఆక్రమణకు గురైంది.

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెద్ద తాడివాడ పంచాయతీ పరిధిలోని గుండాలపేటలోని నారాయణరాజు చెరువు గర్భంలో సుమారు 16 ఎకరాల జిరాయితి భూమిని నవరత్న పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కొనుగోలు చేసి లేఅవుట్ వేశారు. అయితే ఇక్కడ చెరువు గర్భంలో సుమారు కిలోమీటరు పొడువున చెరువు గట్టును ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు మట్టిని వేశారు. ఆ మట్టిని రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుడు మొత్తం తొలగించి అక్రమంగా మట్టిని తరలించి తన సైట్లో వేసుకున్నాడు. పై పెచ్చు ఆ గట్టును తొలగించి చెరువు గర్భాన్ని ఆక్రమించేసుకుంటున్నాడు. రైతులు అడుగుతారని అడ్డుకుంటారని రాత్రి సమయంలో చెరువు గట్టుకు వేసిన మట్టిని అక్రమంగా తరలించాడు. ఈ చెరువు కింద నాలుగు చెరువుల ఆధారపడి ఉన్నాయి. ఈ చెరువు నిండితే మిగిలిన చెరువులకు అన్నింటికీ నీరు వెళుతుంది. ఈ నాలుగు చెరువుల కింద సుమారు 400 ఎకరాలు భూమి ఉంది. సుమారు 450 మంది రైతులు వ్యవసాయం సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఈ మట్టిని తరలించి చెరువు గర్భాన్ని కబ్జా చేయడం వల్ల చెరువులో నీరు స్టాకు ఉండదని దీంతో పంటలకు నీరు అందదని అసలే వర్షాధారంతో ఉన్న భూములని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు రైతులు చెబుతున్నారు. వెంటనే స్పందించిన తహశీల్దార్ పి. ఆదిలక్ష్మి విఆర్‌ఒ, ఆర్‌ఐలను క్షేత్రస్థాయికి పంపించి విచారించగా చెరువు గర్భంలో వేసిన గట్టు మట్టిని తరలించడంతో పాటు చెరువు గర్భాన్ని రియల్ వ్యాపారి కబ్జా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ నివేదికను ఇరిగేషన్, మైన్స్ అధికారులకు పంపిస్తామని తెలిపారు. కాగా రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించకపోతే జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ, ఇరిగేషన్, మైన్స్ అధికారులను తామే నేరుగా కలిసి ఫిర్యాదు చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.


తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు


చెరువు గర్భంలో ఉన్న ఈ రోడ్డునే తవ్వి మట్టిని తరలిస్తూ కబ్జా చేస్తున్నారు..


ఆ సచివాలయంలో ఇద్దరే..

- సక్రమంగా అందని సేవలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి- డెంకాడ

వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీనికి ఒక సచివాలయానికి 10 నుంచి 15 మంది వరకు సిబ్బందిని కేటాయించారు. భవనాల కోసం సుమారు కోటి రూపాయలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. అయితే ప్రభుత్వ నమ్మకాన్ని ముఖ్యమంత్రి ఉద్దేశాన్ని అధికారులు మాత్రం పెడచెవిన పెట్టి ఇవేవీ తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

మండలంలోని మోదవలస సచివాలయంలో సుమారుగా 10 మంది సచివాలయ సిబ్బందిని ప్రభుత్వం నియమిచింది. ఈ సచివాలయ పరిధిలో చిన్నవల్లూరు, పెద్దవల్లూరు, కొండయ్యపాలెం, గండిబోయిన కల్లాలు ఇలా పలు గ్రామాలు ఉన్నాయి. ఇవి కాకుండా మరో మూడు గ్రామాలు కూడా ఈ సచివాలయ పరిధిలోనే ఉన్నాయి. వీరికి సకాలంలో సేవలందించాలని ప్రభుత్వం వీరిని నియమించింది. అయితే ఈ సచివాలయంలో పనిచేసిన సిబ్బంది మొత్తం ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో వెళ్లిపోయారు. ఇక్కడ ప్రస్తుతం గ్రామ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లు మాత్రమే ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారు. బదిలీ అయి వెళ్లిపోయిన స్థానంలో ఇక్కడకు ఎవరూ రాలేదు. దీంతో సచివాలయానికి వివిధ పనులు పై వస్తున్న ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు రెండు నెలల నుంచి ఈ ఇబ్బందులు పడుతున్నామని సచివాలయ పరిధిలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎంపిడిఒ డిడి స్వరూపారాణి దృష్టికి తీసుకురాగా ఆమె మోదవలస సచివాలయానికి బదిలీపై వచ్చే సిబ్బందికి ఫోన్ చేసి వచ్చి జాయిన్ అవ్వాలని కోరినటప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదని తెలిస్తోంది. ఇప్పటికైనా తమ సచివాలయానికి పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి ప్రజలకు సేవలు అందించేటట్టు చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


సచివాలయంలో ఉన్న ఇద్దరు సిబ్బంది వీరే..

'చంద్రబాబు అరెస్టుతో పార్టీకి సంబంధంలేదు'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చంద్రబాబు అరెస్టు వైసిపి పార్టీకి సంబంధం లేదని ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్య నారాయణ రాజు అన్నారు. ఆదివారం ఆయన మొయిద విజయరాంపురం వారి స్వగృహంలో విలేకర్లతో మాట్లాడారు. స్కిల్ డెవలప్మెంట్‌కు సంబంధించి రూ.371 కోట్లు కుంభకోణంలో అన్ని ఆధారాలను సేకరించి టిడిపి అధినేత చంద్రబాబును సిఐడి అధికారులు అరెస్టు చేశార న్నారు. ఇదంతా రాజకీయ కక్షతో చేస్తున్నారని టిడిపి నాయకులు లేనిపోని విమర్శలు చేస్తూ కల్లోలం సృష్టిస్తున్నారని విమర్శించారు.


ఎమ్మెల్సీ సురేష్‌బాబు

పెళ్లిలో మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

చల్లా త్రినాథ్, సత్యల వివాహం సందర్భంగా హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంఘం (హర్డ్స్) ఆధ్వర్యంలో స్థానిక కళ్యాణ మండపం వద్ద 180 పూల, ఫలసాయ మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుభకార్యాలలో మొక్కలను బహుకరించడం, నాటడం పర్యావరణానికి మేలు చేసే మంచి సాంప్రదాయం అన్నారు. అందరూ బాధ్యతగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హర్డ్స్ వ్యవస్థాపకుడు రొంగలి హరి బాబు, జనార్ధన్, లక్ష్మణ్, చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం హర్డ్స్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట రామాలయం నుండి పైడితల్లమ్మ ఆలయం వరకూ రహదారికి ఇరువైపులా 115 మొక్కలు నాటారు.



మొక్కలను పంపిణీ చేస్తున్న జియో ప్రతినిధులు

సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి

బొబ్బిలి: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆంధ్ర ఇవాంజిలికల్ లూదరన్ చర్చ్ (ఎఇఎల్‌సి) (ఎపి, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, అండమాన్ దీవుల) అధినేత మోడరేట్ బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ కె పరదేసిబాబు పిలుపు నిచ్చారు. ఆదివారం ఆయన అధికార పర్యటనలో భాగంగా పార్వతీపురం నుంచి తిరుగు ప్రయాణంలో బొబ్బిలిలో ఉన్న సైంట్ ఆండ్రూస్ లూదరన్ చర్చ్ సందర్శనలో భాగంగా డెలిగెట్ జెసి రాజు గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మోడరేట్ బిషప్ పరదేశబాబు బొబ్బిలి ప్రాంతంలో జరుగుతున్న పరిచర్యను, సంఘ అభివృద్ధిని, బోధకుల పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చర్చ్ డెలిగేట్ జెసి రాజు ఆయనను పట్టు కండువాలతో ఘనం గా సత్కరించారు.

బొబ్బిలిలో వర్షం..

బొబ్బిలి: బొబ్బిలి, పరిసర ప్రాంతంలో ఆదివారం వర్షం కురవడంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు సేద తీరారు. వర్షం ఖరీఫ్ పంటలకు బాగా అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు సరిపడా వర్షాలు కురవకపోవడంతో వర్షాధారంగా సాగు చేస్తున్న పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విశ్వమానవ సౌభ్రాతృత్వ దినోత్సవం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతిలో విశ్వమానవ సౌభ్రాతృత్వ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ జంక్షన్‌లోని వివేకానంద విగ్రహానికి రామకృష్ణ సేవాసమితి ప్రతినిధులు స్వామి అర్చనానంద మహరాజ్, తిరుమల రాజు జగన్నధరాజు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ చికాగో నగరంలో 130 ఏళ్ల క్రితం నిర్వహించిన ప్రపంచ ఆధ్యాత్మిక సభలో వివేకానంద ప్రసంగించారని గుర్తుచేశారు. వివేకానంద ప్రసంగానికి 130 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా నెల్లిమర్లలో బాలవికాస కేంద్రం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.


విగ్రహానికి పూలమాలవేస్తున్న స్వామి


అధ్వానంగా రహదారులు

వాహనదారులకు అవస్థలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పేరుగొప్ప.. ఊరు దిబ్బ అన్నచందంగా రోడ్లు తయారు అయ్యాయి. ఇటీవల సుందరీకరణ పేరుతో కోట్ల రూపాయల ఖర్చు చేస్తున్న నగర పాలక సంస్థ అధికారులు, పాలకవర్గం నగరంలోని ప్రధాన రహదారుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా గత రెండు రోజులుగా కురిసిన చిన్న పాటి వర్షానికి రోడ్లు గతుకులుగా మారి నగర వాసులకు కష్టాలు తెచ్చి పెడుతున్నాయి. ఇటీవల సుందరీకరణ పేరుతో మయూరి జంక్షన్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు ఉన్న సెంటర్ డివైడర్‌ను తొలగించారు. మయూరిజంక్షన్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్సు మీదుగా అంబేద్కర్ జంక్షన్ (జాలాజీజంక్షన్) వరకు తవ్వేసి వదిలేశారు. నెల రోజులు కావస్తున్నా ఇంకా పనులు ప్రారంభించక పోవడంతో గత మూడు రోజులు క్రితం తిరుమల ఆసుపత్రి కి వెళ్లే జంక్షన్ వద్ద ఓ గర్భిణీ బైక్‌పైనుంచి పడిపోయింది. అంబటి సత్రం రోడ్డు వైపు పొరపాటున వెళ్లారంటే ఒంటినిండా మురికి నీరు, బురదతో ఇంటికి రావాల్సిందే. వాహనాలు కారణంగా గుంతల్లో ఉన్న నీరు తుళ్ళి పాద చారులకు, వాహన దారులకు మురికి నీటి స్నానం తప్పడం లేదు. దాసన్నపేట రైతు బజారు వద్ద రాళ్లతేలిపోయి , గుంతలు పడి ఏడాది కాలం అవుతున్నా పటించుకునే వారు లేరు. గూడ్స్‌షెడ్ జంక్షన్ వద్ద కుళాయి నీరు రోడ్డు మీద పారడంతో జంక్షన్‌లో మొత్తం రోడ్డు గతుకులు, గుమ్మగా మారి ప్రమాదంగా తయారైంది. ఈ రోడ్డులో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం కొని తెచ్చుకున్నట్లే. నగరంలోని అయ్యప్ప నగర్‌లో మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారి, సెయింట్ జోసెఫ్ స్కూల్ రోడ్డు రాళ్లు తేలి, గాతలు పడి ప్రమాదంగా తయారయ్యాయి. నగర సుందరీకరణ తరువాత సంగతి..ముందు ఈ రోడ్లకు మోక్షం కల్పించండి అని నగర ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా అంబటి సత్రం కూడలిలో రోడ్డు


మయూరి కూడలిలో రోడ్డు పరిస్థితి..

లాంగ్‌జంప్‌లో జాతీయ పోటీలకు అర్హత సాధించిన పిఇటి

ప్రజాశక్తి - మక్కువ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో గరుగుబిల్లి మండలం నాగూరు జెడ్‌పిహెచ్ స్కూల్లో పిఇటిగా పనిచేస్తున్న మక్కువ మండలం వెంకట భైరిపురానికి చెందిన గేదెల నాగేంద్రరావు నాయుడు లాంగ్ జంప్ విభాగంలో (3.56 మీటర్స్) స్టేట్ మీట్ లో జాతీయస్థాయికి అర్హత సాధించారు. త్వరలో చత్తీష్‌ఘడ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఆయన్ను పాఠశాల హెచ్‌ఎం ఈ.రాజేశ్వర రావు, స్టాఫ్ సెక్రెటరీ బి.చంద్రమౌళి, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. అలాగే వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు మజ్జి. రామకృష్ణ, సెక్రెటరీ ఎం.మురళి, ఎస్‌జిఎఫ్ అధ్యక్షులు డిటి గాంధీ, జిల్లా క్రీడల సమన్వయకర్త మంతెన వాసుదేవరావు నాయుడు, పిఇటిలు, పీడీ అభినందించారు.

వైష్ణవ్ ఐ కేర్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

వెంకటరామ ఆస్పత్రిలో ఆదివారం వైష్ణవ్ ఐ కేర్ సెంటర్‌ను ఆ ఆస్పత్రి అధినేత డాక్టర్ చిట్టి రమణారావు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐ కేర్ సెంటర్‌లో అత్యాధునిక టెక్నాలజీతో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ నేత్ర వైద్యులతో, అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రమణారావు భార్య చిట్టి లలిత, కుమార్తె చార్వీ, ఇతర కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


ఐకేర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డాక్టర్ చిట్టి రమణారావు కుటుంబ సభ్యులు


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు


విజేతలతో నిర్వాహకులు

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిభ కనబరిచారని యువజన మాసోత్సవ చైర్మన్ శంకర్‌రెడ్డి, డైరెక్టర్ బలభద్రుని అశోక్ తెలిపారు. వివిధ పాఠశాలల నుంచి 35 జట్లు, 450 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఉడత్తు రాజేష్, కార్యదర్శి అరుణ్ సోడాని, సంజయ్, కొల్లా మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్ర ధనుష్‌ను విజయవంతం చేయాలి

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు

ప్రజాశక్తి - బెలగాం

మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. సోమవారం నుండి శనివారం వరకు జిల్లా వ్యాప్తంగా జరగబోయే మిషన్ ఇంద్ర ధనుష్ రెండో దశ టీకా కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వైద్య సిబ్బంది వేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా షెడ్యూల్ ప్రకారం గతంలో ఏవైనా కారణాల వల్ల టీకా వేయబడని పిల్లలను సర్వేలో గుర్తించి ప్రస్తుత కార్యక్రమంలో టీకా పూర్తి చేస్తారన్నారు. వీరితో పాటుగా ఈ వారం షెడ్యూలు ప్రకారం టీకా అర్హులు కూడా ఉంటారన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో ఉన్న 37 పిహెచ్‌సిలు, 5 పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 560 టీకా కేంద్రాల్లో 1332 మంది పిల్లలకు, 339 మంది గర్భిణీలకు టీకా వేయనున్నట్లు తెలిపారు. టీకా పూర్తి చేసిన వివరాలన్నీ కొత్తగా చేర్చిన యూవిన్ పోర్టల్‌లో ఆన్లైన్ నమోదు చేస్తారని, ఈ విధానం ద్వారా సచివాలయం పరిధిలోనే టీకా ధ్రువ పత్రాన్ని పొందే వీలుంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే మొదట దశ ఆగస్టులో పూర్తయ్యిందని, ప్రస్తుతం రెండో దశ అని, అక్టోబర్‌లో మూడో దశ ఉంటుందని జగన్మోహనరావు తెలిపారు. టీకా నిర్వహణను బలోపేతం చేసే దిశగా, తట్టు, రుబెల్లా తదితర వ్యాధుల పూర్తి స్థాయి నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు చర్య కాదు

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రతిపక్ష పార్టీ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టు కక్ష సాధింపు చర్య కాదని, పక్కా ఆధారాలతోనే సిఐడి అరెస్టు చేసిందని డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. మండలంలోని కొటికిపెంటలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష టిడిపి నాయకులు కావాలనే ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై బురదజల్లే ప్రయత్నం ఆరోపించారు